క్లుప్తంగా

దుప్పిని హతమార్చిన వేటగాళ్ల రిమాండ్

పెంచికల్‌పేట్: మండలంలోని మేరగూడ గ్రామంలో మంగళవారం దుప్పిని హతమార్చిన ఇద్దరు వేటగాళ్లను రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్‌ఆర్‌వో అనీల్ కుమార్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన దుర్గం నవీన్, దుర్గం సదాశివ్ అనే వ్యక్తులు దుప్పిని హతమార్చారనే సమాచారంతో ఇంట్లో సోదాలు నిర్వహించగా, మాంసం స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచగా.. 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

సన్మానం

కెరమెరి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని కల్లెగాం గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో గురువారం మోడి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నర్సయ్యను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఉన్నత ప్రగతిని సాధించాలని పేర్కొన్నారు. ప్రతిరోజు బాగా చదవాలని, భవిష్యత్‌లో ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. కల్లెగాం పాఠశాల హెచ్‌ఎం నైతం నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మడుగులో పడి రైతు మృతి

రెబ్బెన: మండలంలోని కొమురవెల్లి పంచాయతీ పరిధిలోని రంగాపెల్లి గ్రామానికి చెందిన దుర్గం బిక్కయ్య (50) అనే రైతు గ్రామానికి సమీపంలో గల మడుగులో పడి మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే బిక్కయ్య గురువారం మధ్యాహ్నం సమయం బహిర్భూమికి వెళ్లేందుకు గ్రామానికి సమీపంలో ఉన్న మడుగు వైపు వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు మడుగులో పడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో మాజీ కౌన్సిలర్ మృతి

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని వార్డు నెం.2 మాజీ కౌన్సిలర్ అరవింద్ సింగ్ తిలక్ (60) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఎమ్మెల్యే హరీశ్‌బాబు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



పంటను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాంసి: ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. గురువారం భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామ శివారులో పెన్‌గంగ బ్యాక్ వాటర్ వరదలతో దెబ్బతిన్న పంటలను కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, పార్లమెంటరీ నేత ఆత్రం సుగుణతో కలిసి పరిశీలించారు. వరద కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని, సర్వే చేసి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ.. కార్యక్రమంలో నాయకులు పోతారెడ్డి, రమేశ్, శ్రీనివాస్, అన్నుపటేల్, సుదర్శన్, అమర్ రెడ్డి, అఫ్రోజ్ పాల్గొన్నారు.

కస్తూరిబా పాఠశాల పరిశీలన

సిరికొండ: మండలంలోని కస్తూరిబా పాఠశాలను గురువారం మండల మెడకల్ ఆఫీసర్ హిమబిందు పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎస్‌వో సంధ్యారాణిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. వంటగదిని, సరుకులను పరిశీలించారు.

జీవాలకు టీకాలు వేయించాలి

నేరడిగొండ: మేకలు, గొర్రెలకు ఉచిత వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. గురువారం మండలంలోని బొందిడి, తర్నం(కె), వాంకిడి గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మేకలు, గొర్రెలకు పీపీఆర్ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 20 వరకు సాగుతుందన్నారు. పాడి రైతులు మేకలు, గొర్రెలకు టీకాలు వేయించాలని సూచించారు.

ప్రముఖుల పూజలు

జైనథ్: మండల కేంద్రంలోని అతి ప్రాచీన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, జిల్లా సబ్ రిజిస్ట్రార్ అశోక్ కుమార్‌లు వేర్వేరుగా ప్రత్యేక పూజలు చేశారు. గురువారం జైనథ్‌కు చేరుకొని, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు గావించారు.

ప్రభుత్వ భూములు భద్రమేనా?

- రాజకీయ అండదండలతో కబ్జా
- విలువైన ప్రభుత్వ భూములు మాయం
- కన్నెత్తి చూడని అధికారులు

బెజ్జూర్: ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు అక్రమార్కులు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. ఆపై వాటిని తమ ఆధీనంలో ఉంచుకుని ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినా.. ఎవరూ అడిగేవారు ఉండరన్న ధీమాతో కబ్జాదారులు పెట్రేగిపోతున్నారు. అధికార, అంగబలమే ఆసరాగా భూములు ఆక్రమించేస్తున్నారు. ప్రభుత్వ భూములపై ఎవరికీ హక్కులుండవు. అయినప్పటికీ కొందరు అక్రమార్కులు వాటిని కబ్జా చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని ఎలా విక్రయిస్తారని ఎవరైనా ప్రశ్నిస్తే తమ ఆధీనంలో ఉందని, అందువల్ల అమ్ముతున్నామని సమాధానం ఇస్తున్నారు. విక్రయించిన అనంతరం మరోచోట వేరే ప్రభుత్వ భూమి కబ్జాపర్వాన్ని తెరలేపుతున్నారు. ఫలితంగా పేదలకు దక్కాల్సిన భూములు పెద్దల పరమవుతున్నాయి. ప్రస్తుతం ప్రజావసరాలకు అంగుళం భూమి కూడా లభించే పరిస్థితి కనిపించడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయి.

రాజకీయ అండదండలతో..

బెజ్జూర్ మండలంలో ఉన్న ప్రభుత్వ భూములు భద్రంగా ఉన్నాయా? లేదా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. బెజ్జూర్ మండల కేంద్రంలో బస్టాండ్ కోసం 40 సెంట్లు మంగలి షాపుల కోసం 10 సెంట్లు, అంగడిబజార్ కోసం 30 సెట్లు, కిరాణా షాపుల కోసం 10 సెంట్లు, అటవీ శాఖ భవనం కోసం 30 సెంట్లు ఇలా మొత్తం ఒక ఎకరం 20 సెంట్లు సర్వే నం.237తో పాటు మరో సర్వే నంబర్‌లో బట్టల దుకాణాల కోసం ప్రభుత్వ భూమి వదిలారు. అది కొంత మంది రాజకీయ నాయకుల అండదండలు ఉన్న వారు ఆక్రమించుకొని భవనాలు నిర్మించారు. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ప్రభుత్వ భూమిలో నిర్మించిన భవనాలు

అప్పటి అధికారులే కారణం!

ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికారులు అప్పట్లో అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తడంతో ప్రభుత్వ భూములు ఆక్రమణ జరిగినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయకుండా చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులే దగ్గరుండి అప్పట్లో వారికి అన్నివిధాల సహాయ సహకారాలు అందించారనే విమర్శలు లేకపోలేదు.

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు..

ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. భూములు కబ్జాకు గురవుతుంటే సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్రమార్కులు కబ్జా చేసేస్తున్నారు. అందులోనూ ప్రభుత్వ స్థలాలను వదిలిపెట్టడం లేదు. ముడుపులు తీసుకోవడంలో ఉన్న శ్రద్ధ వారి పనితీరుపై లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూములను కబ్జా నుంచి విముక్తి చేసి ప్రజావసరాలకు వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎలాంటి ఫిర్యాదు అందలేదు..

బెజ్జూర్ మండలంలో ప్రభుత్వ భూములను కబ్జా చేసినట్లు తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. సంబంధిత సర్వేయర్‌ను పంపించి సర్వే చేపడతాం. ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే తగు చర్యలు తీసుకుంటాం.

– భూమేశ్వర్, తహశీల్దార్, బెజ్జూర్

కొమురయ్య ఆశయాలు సాధించాలి

రెబ్బెన: సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన మనుబోతుల కొమురయ్య ఆశయాలను సాధించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి అన్నారు. కొమురయ్య 28వ వర్ధంతిని గురువారం ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీ, కై రిగూడ ఓసీపీ, జీఎం కార్యాలయం, గోలేటిలోని సివిల్ డిపార్టుమెంట్, ఏరియా వర్క్‌షాప్, ఎస్అండ్‌పీసీ డిపార్టుమెంట్లలో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సింగరేణి వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా వేజ్‌బోర్డు సభ్యుడిగా పని చేసి కార్మికులకు అనేక హక్కులు కల్పించాడని కొనియాడారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పని చేసి అలుపెరగని సేవలు అందించారు. ఆయన ఆశయ సాధనకు యూనియన్ లోని ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమాల్లో బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషు, జగయ్య, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, ఆనంద్, ఫిట్ కార్యదర్శులు మారం శ్రీనివాస్, ఎంబడి రామయ్య, గడ్డం రమేశ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

సివిల్ సప్లై హమాలీల ధర్నా

ఆసిఫాబాద్‌అర్బన్: గత ప్రభుత్వం కుదిర్చిన ఒప్పందం మేరకు సివిల్ సప్లై హమాలీలకు కూలి రేట్లు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉపేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట గురువారం హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా క్వింటాల్‌కు రూ.26 నుంచి రూ.35కు హమాలీ రేట్లు పెంచాలని, కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, బోనస్ రూ.6,500 నుంచి రూ.10వేలకు, యూనిఫాం కుట్టు కూలి రూ.1,300 నుంచి రూ.2వేలకు పెంచాలన్నారు. గోదాంల్లో అవసరానికి అనుగుణంగా కార్మికులను నియమించుకునే అధికారం కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ పథకాన్ని రద్దు చేసి ఏటీఎం, ఏటీఆర్‌ను పెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏవో మధుకర్, సివిల్ సప్లై డీఎం నరసింహస్వామికి వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్, కార్మికులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

పుస్తక పఠనం అలవాటు చేయాలి

కెరమెరి: విద్యార్థులు పుస్తక పఠనం చేయాలని రూంటు రీడ్ బ్లాక్ కోఆర్డినేటర్లు వెంకటలక్ష్మి, రాజు అన్నారు. గురువారం మండలంలోని బారేమేడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలతో పాటు సుర్దాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రూంటు రీడ్ పుస్తకాలను చదివించారు. కథలను చెప్పారు. ప్రతిఒక్కరూ కథల పుస్తకాలు చదవాలని దీంతో చదువులో నైపుణ్యం పెరుగుతుందన్నారు. రంగుల రంగుల బొమ్మతో ముద్రించిన పుస్తకాలు విద్యార్థులను ఆకట్టుకునేలా ఉన్నాయని, బొమ్మలు వాటి పక్కనే బొమ్మల కృత్యాలు ఉన్నాయన్నారు. ప్రధానోపాధ్యాయుడు సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కథలు చెబుతున్న రాజు

యువతకు ఇంటర్‌నెట్ తిప్పలు

రెబ్బెన: జైనూర్‌లో జరిగిన ఆందోళనల నేపథ్యంపై శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని అధికారులు జిల్లాలో బుధవారం అర్ధరాత్రి నుంచి ఇంటర్‌నెట్ సేవలను పూర్తి నిలిపివేశారు. ఒక్కసారిగా ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోవటంతో ఆన్‌లైన్ సేవలన్నీ నిలిచిపోయాయి. దాంతో ప్రస్తుతం కొనసాగుతున్న స్మార్ట్‌ఫోన్ యుగంలో ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోవటంతో సామాజిక వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం, ట్విట్టర్ మూగబోయాయి. దీంతో అరచేతిలో స్మార్ట్‌ఫోన్ ఉన్న నెట్ లేకపోవటంతో యువత ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సెల్‌ఫోన్ చూసుకుంటూ కాలాన్ని మర్చిపోయే నేటితరం ప్రజానికానికి ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోవటంతో ఏమీ చేయాలో తెలియక సతమతమవుతున్నారు. గతంలో మాదిరి మేసెజ్‌లు, ఫోన్‌కాల్స్ చేసుకుంటూ చర్చించుకుంటున్నారు. కొంతమంది ఇంటర్‌నెట్ సేవల కోసం జిల్లా సరిహద్దుకు పరుగులు తీస్తున్నారు. జిల్లాలోని జైనూర్‌లో జరిగిన ఆందోళనలు విస్తృతం కాకుండా ఉండటంతో పాటు శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని అధికార యంత్రాంగం జిల్లాలో ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేసింది. అయితే మండలంలోని ప్రజలకు జిల్లా సరిహద్దు కేవలం 6 కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉండటంతో నెట్ సేవల కోసం జిల్లా సరిహద్దుకు పరుగులు తీస్తున్నారు. మండలంలోని తక్కళ్లపల్లి బస్టాండ్ సమీపంలోని ఎకో వంతెన వద్దకు వెళితే మంచిర్యాల పరిధిలోని తాండూర్ సెల్‌టవర్ల ద్వారా ఇంటర్‌నెట్ రావటంతో అక్కడికి వెళ్లి ఇంటర్‌నెట్ వినియోగించుకుంటున్నారు.



తక్కళ్లపల్లి ఎకో వంతెన వద్ద ఇంటర్‌నెట్ వినియోగించుకుంటున్న యువత

కఠిన చర్యలు తీసుకుంటాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అదుపులో తీసుకొని జైలుకు పంపారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. జైనూర్ మండలం కేంద్రంలో బుధవారం జరిగిన ఘటన బాధాకరమన్నారు. ఇరువర్గాలు సంయమనం పాటించాలన్నారు. ఆదివాసీలను అడ్డం పెట్టుకొని కొందరు ప్రశాంతవంతమైన వాతావరణాన్ని చెడగొట్టే కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. ఘటనలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు హస్తం ఉందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఇచ్చోడ: రుణమాఫీ కానీ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్ అన్నారు. గురువారం మండలంలోని ముఖరా(కె) గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రెండు లక్షల రుణం ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తుందన్నారు. వివిధ కారణలతో కొంత మంది రైతులకు రేషన్‌కార్డులేక పోవడంతో రుణమాఫీ కాలేదన్నారు. వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వారితో సెల్ఫీ దిగి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో సాయిరాం, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో జాదవ్ కైలాస్

నేరడిగొండ: రైతులకు రుణమాఫీ కాకపోవడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. ఆయా గ్రామాల రైతువేదికల వద్ద సంబంధిత శాఖ అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. గురువారం మండలంలోని కుమారి రైతువేదిక వద్ద వివిధ గ్రామాల రైతులు అక్కడికి చేరుకొని సంబంధిత అధికారుల వద్ద పేర్లను నమోదు చేయించుకున్నారు. ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

బీజేపీ నాయకుల అరెస్ట్

నార్నూర్: జైనూర్‌లో మహిళపై అత్యాచారం, హత్యయత్నానికి పాల్పడిన నిందితుడికి ఉరితీయాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రం నుంచి జైనూర్ బయలుదేరిన బీజేపీ నాయకులు రాథోడ్ బాబులాల్, రాథోడ్ బిక్షపతి, తొడసం బండు, ధర్మ రక్షక్ రామ్ నివా స్‌లను పోలీసులు గాంధీచౌక్ వద్ద అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. బాధిత కుటుంబానికి పరామర్శించడానికి వెళ్తున్న నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి నిందితుడికి ఉరిశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేవిదాస్, రవీందర్, తదితరులు ఉన్నారు.

దుండగుడిని కఠినంగా శిక్షించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై జరిగిన దాడికి కారకులైన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం దినకర్, గొడిసెల కార్తీక్‌లు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. ఆదివాసీ మహిళలపై దాడులు జరగడానికి కొన్ని రాజకీయ పార్టీల ఎత్తుగడలేనని ఆరోపించారు. భవిష్యత్‌లో ఇలాంటి అల్లర్లు జరుగకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో నాయకులు రాజేందర్, కోట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: ఆదివాసీ మహిళపై లైంగిక దాడికి యత్నించి, హత్యయత్నం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమ్రం మాంతయ్య, కుమురం భీం జిల్లా మన్నెవార్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బ బాపులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు కుర్మ రాజు, ప్రసాద్, రంగయ్య, సత్తయ్య, సురేశ్, ఉమేష్, హనుమంతు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై జరిగిన హత్యాచారం, హత్యాయత్నం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో మాట్లాడారు. ఆదివాసీ మహిళపై తీవ్రంగా దాడి చేసి హత్యాయత్నం, హత్యాచారానికి పాల్పడిన వారిపై తక్షణమే శిక్ష పడేలా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు గంట గోపాల్, గడ్డం గంగన్న, బి.శ్రీనివాస్, నాయిని సత్తయ్య, భీంరావ్, హన్మంత్, ప్రశాంత్, పవన్ పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో రాస్తారోకో చేస్తున్న మహిళలు

బాధితురాలికి న్యాయం చేయాలని రాస్తారోకో

కాగజ్‌నగర్ రూరల్: జైనూర్ సంఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో మహిళలు రాస్తారోకో నిర్వహించారు. మహిళా మోర్చా నాయకురాలు శ్రీదేవి మాట్లాడుతూ బాధిత మహిళకు న్యాయం జరగకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఆదివాసీ మహిళ ఉన్న జిల్లాలో ఇలాంటి ఘటన జరగడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, నాయకులు మాచర్ల శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

కెరమెరి: ఆదివాసీ మహిళలపై జరిగిన అత్యాచార యత్నం నేపథ్యంలో ఆదివాసీ సంఘాలు గురువారం పిలుపునిచ్చిన బంద్ విజయవంతమైంది. వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఆయా ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.

అధ్వాన రోడ్లపై ప్రయాణ కష్టాలు



కోతకు గురైన ఇందాపూర్‌కు వెళ్లే రోడ్డు

- భారీ వర్షాలకు కోతకు గురైన రోడ్లు
- ప్రజలకు తప్పని తిప్పలు
- మరమ్మతులు చేయించని అధికారులు

కెరమెరి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు కోత గురయ్యాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గడిచిన పక్షం రోజుల క్రితం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో రోడ్లు దెబ్బతిన్నాయి. ఫలితంగా రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆయా రోడ్ల పరిస్థితులను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి వెళ్లినప్పటికీ మరమ్మతులపై దృష్టి పెట్టలేదు.

చూస్తేనే భయం..

ఇటీవల అనేక గ్రామాల్లో ఎన్ఆర్ఈజీస్ నిధులతో అంతర్గత రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అవి పర్వాలేదనుకున్న ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. మండలంలోని జోడేఘాట్ వైపుకు వెళ్లే దారిలో పాట్నాపూర్ గ్రామానికి సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురైంది. అటు వైపు సుమారు మరో ఐదు గ్రామాలు ఉన్నాయి. మరో రెండు మాసాల తర్వాత కుమురం భీం వర్ధంతి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. దీంతో వెంటనే మర్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అలాగే ఇందాపూర్ గ్రామం వైపుకు వెళ్లే ఇంద్రానగర్, సీంగూడ గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు వద్ద ప్రధాన రోడ్డు కోతకు గురయ్యాయి. సుమారు ఐదు మీటర్ల పొడవు కోతకు గురైంది. పాదచారులు, ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. ఆగుర్‌వాడ నుంచి ఉమ్రి గ్రామానికి వెళ్లే రహదారికి రెండు కిలో మీటర్ల వరకు కచ్చా రోడ్డు ఉంది. పూర్తిగా కోతకు గురవడంతో వాహదారులు ఇబ్బంది పడుతున్నారు.



పాట్నాపూర్ వెళ్లే మార్గంలో కోతకు గురైన కల్వర్టు

మరమ్మతులు చేయాలి



మండలంలోని చాలా ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో చాలాసార్లు అధికారులకు తెలిపినప్పటికీ ఎవ్వరూ పట్టించుకోలేదు. ఫలితంగా రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి.

– సిడాం ధర్మూ, పీవీటీజీ సూపర్‌వైజర్, కెరమెరి

రోడ్డుకు మరమ్మతులు

ఇంద్రవెల్లి: భారీ వర్షాల కారణంగా కోతకు గురైన రోడ్డు, కల్వర్టులకు డీఆర్‌డీవో సాయన్న ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ అధికారులు మరమ్మతులు చేశారు. గురువారం మండలంలోని గిన్నేర గ్రామ పంచాయతీ పరిధిలోని కోతకు గురైన మర్కగూడ కల్వర్టు, వడగామ్ గ్రామపంచాయతీ పరిధిలోని పాటగూడ వాగు వద్ద కల్వర్టుకు మరమ్మతులు చేసి, పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు షారిణ సుల్తానా, రవీందర్ పాల్గొన్నారు.



కల్వర్టుకు మరమ్మతు చేయిస్తున్న అధికారులు